సాక్షి

కాకినాడ

మంగళవారం । 3 । డిసెంబర్ । 2024



ప్రశాంతంగా ఎన్నికల పోలింగ్ నిర్వహించండి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఈ నెల 5న ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని డీఆర్వో జె.వెంకటరావు ఆదేశించారు.


8 లో



పర్యావరణానికి ప్రాధాన్యం ఇచ్చేలా..

ఇంజినీరింగ్ విద్యార్థులను పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములను చేయడానికి ఏపీసీటీఈ శ్రీకారం చుట్టింది.

5,100 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 5,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 1,500, మధ్య డెల్టాకు 600, పశ్చిమ డెల్టాకు 3,000 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

కనువిందు చేసిన జటాజూటాలంకరణ

పంచారామ క్షేత్రంలో ముగిసిన కార్తిక మాస ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామి వారి జటాజూటాలంకరణ కనువిందు చేసింది. కార్తిక మాసం ముగింపు రోజు పోలి పాడ్యమి సందర్భంగా స్వామి వారికి వెండి జటాజూటంతో అలంకరణ చేయడం ఆనవాయితీ. ఈ మేరకు బ్యాంకు లాకరులో భద్రపర్చిన వెండి జటాజూటంను ఉత్సవ కమిటీ చైర్మన్, భక్త సంఘం నాయకులు ఆలయానికి తీసుకొని వచ్చారు. జటాజూటంకు వేద పండితులు సంప్రోక్షణ చేసి స్వామివారికి అలంకరించారు. స్వామి వారి అలంకరణను తిలకించడానికి సాయంత్రం భక్తులను అనుమతించారు. సోమవారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారు బాలాత్రిపుర సుందరిదేవికి బంగారు కిరీటంతో పాటు బంగారు ఆభరణాలతో అలంకరణ చేశారు. వేలాది మంది భక్తులు స్వామి వారిని అమ్మవార్లను దర్శించుకోవడానికి బారులు తీరారు. ఈ సందర్భంగా నిర్వహించిన మహిళల కోలాటం, వీరభద్రుని నృత్యం ఆకట్టుకున్నాయి.

పీజీఆర్ఎస్‌కు 308 అర్జీలు



ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో అర్జీలను స్వీకరిస్తున్న జేసీ రాహుల్ మీనా

కాకినాడ సిటీ: ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో (పీజీఆర్ఎస్) అందిన అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, జెడ్పీ సీఈవో వీవీవీఎస్ లక్ష్మణరావు, సీపీవో పి.త్రినాథ్, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు, కేఎస్ఈజెడ్ ఎస్డీసీ రామలక్ష్మిలతో కలిసి హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. రెవెన్యూ, బియ్యం కార్డుల మంజూరు, పింఛన్లు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, టిడ్కో గృహాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు, ఆక్రమణల తొలగింపు, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుధ్యం, సదరం సర్టిఫికెట్ల మంజూరు వంటి అంశాలకు చెందిన మొత్తం 308 అర్జీలను ప్రజల నుంచి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అందిన వినతులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

దివీస్ ఉద్యమ కేసులను కొట్టేసిన కోర్టు



దివీస్ కేసులో కోర్టు తీర్పుతో నిర్దోషులుగా బయటకు వచ్చిన సీపీఎం నాయకులు

తుని: తొండంగి మండలంలో ఏర్పాటు చేసిన దివీస్ ఫార్మా కంపెనీని వ్యతిరేకించిన ఉద్యమకారులపై పోలీసులు పెట్టిన అక్రమ కేసులను తుని కోర్టు కొట్టేసిందని న్యాయవాది ఆకాశపు మల్లేశ్వరరావు సోమవారం తెలిపారు. జూనియర్ సివిల్ కోర్టులో 2016లో సీపీఎంకు చెందిన 13 మందిపై అప్పట్లో పోలీసులు కేసులు నమోదు చేశారు. ఎనిమిదేళ్ల పాటు సుదీర్ఘంగా విచారణ జరిపి అనేక మంది సాక్షులను విచారించింది. అప్పటి ఎస్‌హెచ్‌వో ఇచ్చిన వ్యతిరేక సాక్ష్యంతో కోర్టు కేసు కొట్టివేస్తూ తీర్పు ఇచ్చిందన్నారు. ఇప్పటి వరకు దివీస్ ఉద్యమంలో పోలీసులు పెట్టిన 10 కేసులను కోర్టు కొట్టివేసిందని మల్లేశ్వరరావు తెలిపారు. 13 మందిని నిర్దోసులుగా భావించిందన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సి.మధు, రాష్ట్ర నాయకుడు రావుల వెంకయ్య, కాకినాడ జిల్లా నాయకులు పెంట్యాల నరసింహారావు, ఎం.వేణుగోపాల్, దువ్వా శేషుబాబ్జి, కె.సత్య శ్రీనివాస్, కె.సింహాచలం, ఎం.వీరలక్ష్మి, జి.బేబీరాణి, వెంకటలక్ష్మి, సత్యవతులను నిర్దోషులుగా కోర్టు ప్రకటించిందని చెప్పారు. కోర్టు తీర్పు తర్వాత బయటకు వచ్చిన ఉద్యమ కారులను పలువురు అభినందించారు.

దళారి రాజ్యం..

సర్కారు చోద్యం



పాత పెద్దాపురంలో ధాన్యాన్ని రోడ్లపై నుంచి ట్రాక్టర్లలోకి ఎగుమతి చేస్తున్న రైతులు



గుడివాడలో తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న రైతులు

- తేమ పేరుతో ఖరీఫ్ పంట దోపిడీ
- ప్రతి బస్తాకు రూ.200 నష్టం
- మద్దతు ధరకు కొనుగోలు వట్టిమాటే
- ప్రభుత్వ జాప్యం రైతులకు శాపం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: 'నేతి బీరకాయలో నెయ్యి' చందంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కనిపిస్తోంది. కనీస మద్దతు ప్రకటనలకే పరిమితమైంది. రైతు భరోసా కేంద్రానికి ఫోన్‌కాల్ చేస్తే చాలు సిబ్బంది కళ్లాల్లో శాంపిల్స్ తీసుకుని, పట్టుబడి చేసి, మిల్లుకు చేరవేసి కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తారని చెప్పిన మాటలు నీటిమీద రాతలుగా మిగిలాయి. ధాన్యం కొనుగోలులో అడుగడుగునా దళారీల ప్రమేయంతో రైతులు దోపిడీకి గురవుతున్నారు. తేమ 17శాతం ఉంటేనే అనుమతిస్తున్నారు. ఆపైన 22 శాతం వరకు కేజీ నుంచి ఐదు కేజీల వరకు ధాన్యం కోత పెడుతున్నారు. ఫలితంగా రైతు రూ.150 నష్టపోతున్నాడు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో తేమ 30 శాతం వరకు కూడా అనుమతించి ధాన్యాన్ని కొనుగోలు చేసేవారు. ఇప్పుడది ఎక్కడా కనిపించడం లేదని రైతులు మండిపడుతున్నారు.

పెరిగిన పెట్టుబడి... తగ్గిన దిగుబడి

ఖరీఫ్ రైతు రెక్కల కష్టం దళారుల పరమవుతోంది. తుపాను ఫలితంగా వచ్చిపడ్డ వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కళ్లాల్లోనే అయిన కాడికి అమ్మేస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లలో సర్కారుకు ముందుచూపు లేక పోవడం రైతులకు శాపంగా పరిణమించింది. అధిక వర్షాలు, వరదలతో పెట్టుబడులు తడిసిమోపెడై ఈసారి ఖరీఫ్ సాగు రైతులకు పెను భారమైంది. పెరిగిన పెట్టుబడికి తగ్గట్టు ధాన్యం దిగుబడులు వచ్చాయా అంటే అదీ లేదు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన వర్షాలు, వరదలతో దిగుబడులు తగ్గిపోయాయి. ఎకరాకు కనీసం 40 బస్తాలు దిగుబడి ఖాయమని రైతులు పెట్టుకున్న ఆశలు వాతావరణ ప్రభావంతో అడియాసలయ్యాయి. పెట్టుబడులు పెరిగి దిగుబడులు తగ్గినా కనీసం ధర విషయంలో మంచి జరుగుతుందని ఎదురుచూసిన రైతులకు అక్కడా చుక్కెదురైంది. ధాన్యం కొనుగోలు చేస్తున్నట్టు ప్రభుత్వం హడావుడి చేసింది తప్పితే రైతులకు కనీస మద్దతు ధర దక్కేలా చేయలేకపోయింది.

అయినకాడికి అమ్మకాలు

ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వచ్చిన వర్షాలు, వరదలతో పెట్టుబడులు పెరిగిపోయాయి. తుని, కాకినాడ సిటీ(ఇక్కడ వ్యవసాయం లేదు) మినహా మిగిలిన ఐదు నియోజకవర్గాల్లో వరి కోతలు 80 శాతం పూర్తి అయ్యాయి. తుని నియోజకవర్గంలో మాత్రం 20 శాతం, పిఠాపురం నియోజకవర్గంలో 50 శాతం మించి వరి కోతలు అవ్వ లేదు. కోతలు పూర్తి అయి పంట చేతికందిందనే తరుణంలో ఫెంగల్ తుపాను రైతుల ఆశలపై నీళ్లు చల్లి కోలుకోలేని దెబ్బతీసింది. చేతికందిన పంట కళ్లాల్లోను, రోడ్లపైన బరకాలు వేసి కాపాడుకునే దుస్థితి ఏర్పడింది. తడిసిన ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉందనే సాకుతో కొనుగోలు చేయడానికి ఎవరూ ముందుకు రాక.. తక్కువ ధరకే అమ్ముకుని రైతులు నష్టపోతున్నారు. తుపానుతో తడిసి ముద్దయిన ధాన్యం 90వేల మెట్రిక్ టన్నులు జిల్లాలో రోడ్లుపైన, కళ్లాల్లో ఉంది. ఎకరాకు దిగుబడి 30 నుంచి 35 బస్తాలు మాత్రమే వస్తోంది. కౌలుకు చేసిన పంటల్లో ఎకరాకు 30బస్తాలు దిగుబడి వస్తే 10 బస్తాలు కౌలు పోగా, మిగిలిన 20 బస్తాలు పెట్టుబడులకే సరిపోతున్నాయి. ఇక మిగిలేది ఏమీ లేక కౌలు రైతులు కన్నీరు పెడుతున్నారు. దీనికితోడు ఏలేరు, పీబీసీకి వచ్చిన వరదలు కూడా ముంచెత్తడంతో పిఠాపురం, గొల్లప్రోలు, ఉప్పాడ కొత్తపల్లి, సామర్లకోట మండలాలల్లో పంటలు మునిగిపోయి నష్టపోయారు. ఏలేరు వరదతో పెట్టుబడులు తడిసి మోపెడయ్యాయి. ఎకరాకు రూ.25 వేల పెట్టుబడికి బదులు రూ.40వేలు అయింది. 40 బస్తాలు దిగుబడి వస్తుందనుకుంటే ఎకరాకు 25 బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చింది. ఈ తరుణంలో కూడా ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో తేమ శాతం నిబంధనలు సడలించక పోవడంతో రైతులు కళ్లాల్లోనే ధాన్యాన్ని అయినకాడికి అమ్మేస్తున్నారు.

ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరం, ప్రత్తిపాడు మండలాల్లో ధాన్యం కొనుగోళ్లు ఇప్పుడిప్పుడే మొదలయ్యాయి. శంఖవరం మండలంలో కోతలు ప్రారంభం కాలేదు. ఏలేశ్వరం, ప్రత్తిపాడు మండలాల్లో 75కేజీల బస్తా రూ.1,400కు కొనుగోలు చేస్తున్నారు. తేమ శాతం పెద్ద ప్రతిబంధకంగా మారడంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. ఎకరాకు రూ.35 వేల నుంచి రూ.40వేలు పెట్టుబడి పెట్టగా ఎకరాకు 30 బస్తాలు మించి దిగుబడి రాలేదు. అంటే ఎకరానికి 10 బస్తాలు దిగుబడి తగ్గిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడి మండలంలో ఇటీవల వరదలకు రాజుపాలెం, ముక్కోల్లు, భూపాలపట్నం, రామకృష్ణాపురంలలో రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం అమ్మేందుకు రైతులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. తేమ శాతం ఎక్కువ ఉందనే సాకు చూపి ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో రైతులు రైతు సేవా కేంద్రాలకు వెళ్లకుండా వెనక్కు తగ్గుతున్నారు. ఈ క్రమంలో రైతులు గత్యంతరం లేక దళారులను ఆశ్రయించి 75 కేజీల బస్తా రూ.1,400కే అమ్ముకుంటున్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు గోకవరం మండలంలో 7,020, కిర్లంపూడి మండలంలో 361 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. తేమ శాతమే పెద్ద గుదిబండగా మారడంతో రైతులు రూ.1,450 నుంచి రూ.1,550గా దళారులకు అమ్ముకుంటున్నారు. జిల్లా అంతటా ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

ఖరీఫ్‌లో సాగైన భూమి:	2.14 లక్షల ఎకరాలు
దిగుబడి లక్ష్యం:	ఐదు లక్షల మెట్రిక్ టన్నులు
పూర్తయిన వరి కోతలు:	1,40,000 ఎకరాలు
కళ్లాల్లో ఉన్న ధాన్యం:	85 వేలమెట్రిక్ టన్నులు
కొనుగోలు కేంద్రాలు:	277
ప్రభుత్వం కొన్న ధాన్యం :	90 వేల మెట్రిక్ టన్నులు
కనీస మద్దతు ధర 75 కేజీలు:	రూ.1,725
వాస్తవంగా రైతుకు దక్కుతున్న ధర:	1,400

దళారులే దిక్కు..

ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ధాన్యం కొనుగోలు చేయడంలో విఫలమైంది. జిల్లాలో పిఠాపురం, కాకినాడ రూరల్, పెద్దాపురం, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో రైతులు గత్యంతరం లేని పరిస్థితుల్లో దళారీలకు తక్కువ ధరకే అమ్ముకున్నారు. ప్రభుత్వం జిల్లావ్యాప్తంగా 277 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు చెబుతోంది. ఆ కేంద్రాలలో నామ్‌కే వాస్తేగా కొనుగోలు జరిగిందని రైతు ప్రతినిధులు ఆరోపిస్తుంటే, 85 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్టు జిల్లా యంత్రాంగం చెబుతోంది. ప్రభుత్వం కనీస మద్దతు ధర రూ.1,725గా నిర్ణయించింది. ఈ ధర ధాన్యం విక్రయించిన మెజార్టీ రైతులకు దక్కనే లేదు.

పెట్టుబడి రాలేదు



ఏలేరు వరదల కారణంగా పంట ఆలస్యం అవడమే కాకుండా పెట్టుబడి తడిసిమోపెడైంది. ఎకరాకు పెట్టుబడి రూ.30 వేల నుంచి రూ.40వేలు అయింది. 24 బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చింది. అంటే కనీసం పెట్టుబడి కూడా తిరిగి చూడలేక పోయాను. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ధాన్యాన్ని అమ్ముకోలేకపోవడంతో దళారులను ఆశ్రయించి ప్రతి బస్తాకు రూ.150 నుంచి రూ.200 నష్టపోయాం.

– ఎస్.ప్రకాశరావు, రైతు, ఇసుకపల్లి, కొత్తపల్లి మండలం

మద్దతు ధర దక్కలేదు



30 ఏళ్ల నుంచి కౌలు వ్యవసాయం చేస్తున్నా. మహారాణి సత్రం భూమి సుమారు ఎకరంన్నర సాగు చేస్తున్నా. గతం కంటే ఈ తొలకరిలో పెట్టుబడులు పెరిగిపోయాయి. వాతావరణంలో వచ్చిన మార్పులతో వర్షాలు, వరదలు రావడంతో చాల ఇబ్బందుల్లో సాగు చేశాం. కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. ఎకరంన్నర సాగు చేస్తే చేతికందిందే సుమారు 40 వేల రూపాయలు. వాటిలో కౌలు శిస్తు 18 వేల రూపాయలు పోనూ నా పంట పెట్టుబడి తీస్తే ఏమీ మిగల లేదు. ప్రస్తుత తుపానుతో వచ్చి పడ్డ అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని తక్కువకు అమ్ముకోవాల్సి వచ్చింది. 75 కేజీల బస్తాకు రూ.1,380 ఇచ్చారు.

–కొల్లు శాంతమ్మ, కౌలు రైతు, పాత పెద్దాపురం

75 కేజీల బస్తా రూ.1,400కే



ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడి పెట్టాను. 30 బస్తాలకు మించి దిగుబడి రాలేదు. గత సీజన్‌లో ఇదే సమయంలో 40 బస్తాల దిగుబడి వచ్చింది. రైతు కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం అమ్ముకునే పరిస్థితి లేదు. 75 కేజీల బస్తా పచ్చివి రూ.1,400కు, ఆరబెడితే రూ.1,620లకు మించి ఒక్క రూపాయి కూడా రావడం లేదు. మద్దతు ధర మాత్రం రూ.1,740 ఉంది. వాతావరణ పరిస్థితులతో ఆందోళన చెంది కళ్లాల్లోనే రూ.1,400కే అమ్ముకుంటున్నాం.

– అల్లాడి రాజు, రైతు, వడ్లమూరు, పెద్దాపురం

బియ్యం అక్రమ రవాణాపై నిఘా

కాకినాడ సిటీ: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదల ఆహార భద్రత కోసం ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బియ్యం అక్రమ రవాణా, రీసైక్లింగ్‌కు పాల్పడే వారిపై పటిష్టమైన నిఘా, నిశితమైన తనిఖీలను కొనసాగించాలని కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ తరలింపు, రీసైక్లింగ్ పాల్పడుతున్న వారిపై ఇప్పటి వరకూ నమోదు అయిన కేసులు, వాటి విచారణ, అక్రమాలపై చేపట్టిన చర్యలపై సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాలతో కలిసి పౌరసరఫరాలు, పోలీస్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. పీడీఎస్ బియ్యం అక్రమ తరలింపు నిరోధానికి నిరంతరం పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామన్నారు. అనుమానిత కార్యకలాపాలపై తనిఖీలు కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో గతంలో నిర్వహించిన తనిఖీలలో భాగంగా బియ్యం అక్రమ రవాణా, పీడీఎస్ బియ్యం రీసైక్లింగ్ పాల్పడుతున్న వారిపై నమోదు అయిన కేసుల్లో దోషులపై చట్టపరమైన చర్యలు చేపట్టేందుకు లోతైన విచారణ చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు పౌర సరఫరాలు, పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమన్వయంతో పని చేయాలన్నారు. సమావేశంలో గత జూన్, జులై నెలల్లో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కాకినాడ జిల్లా పర్యటనలో భాగంగా నిర్వహించిన తనిఖీల సందర్భంగా నమోదు చేసిన 13 కేసులపై జరిపిన విచారణ, చేపట్టిన చర్యలపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ అధికారి ఆర్.సుస్మిత, సీపీవో పి.త్రినాథ్, ఇన్‌చార్జి డీఎస్‌వో టి.లక్ష్మీప్రసన్నదేవీ, పౌరసరఫరాల సంస్థ డీఎం దేవులానాయక్, కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు పాల్గొన్నారు.



బియ్యం అక్రమ రవాణా, రీసైక్లింగ్‌పై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ పోర్టును దెబ్బతీయవద్దు

- 30 వేల కార్మికులను రోడ్డున పడవేయొద్దు
- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మధు

కాకినాడ సిటీ: కాకినాడ పోర్టులో అక్రమాలు జరుగుతున్నాయన్న సాకుతో కాకినాడ పోర్టు ప్రతిష్టను దిగజార్చవద్దని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను కోరారు. సోమవారం కాకినాడలో జరిగిన పార్టీ సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడారు. 200 సంవత్సరాల క్రితమే కాకినాడ పోర్టు ఏర్పడిందన్నారు. 1995 సంవత్సరం నుంచి బియ్యం ఎగుమతులు ప్రారంభించారన్నారు. ఈ పోర్టును నమ్ముకుని 30 వేల మంది కార్మికులు బతుకుతున్నారన్నారు. పోర్టులో పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారన్న ఆరోపణలు నిజమైతే అధికారంలో ఉన్నది మీరే కాబట్టి వెంటనే సీబీఐ విచారణ చేపట్టాలని మధు కోరారు. కాకినాడ యాంకరేజ్ పోర్టును అభివృద్ధి చేయడానికి గతంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు కాకినాడ ప్రతినిధులు ఎంతగానో కృషి చేశారని తెలిపారు. ఈ రోజు మీరు కొత్తగా వచ్చి పూర్తిగా అవగాహన చేసుకోకుండా రాజకీయ అవసరాల కోసం ఏవేవో మాటలు మాట్లాడుతున్నారని, ఇది సరైనది కాదని మధు పేర్కొన్నారు. నిజంగా పీడీఎస్ బియ్యం అక్రమంగా ఎగుమతులు జరుగుతుంటే గొడౌన్‌లో చెక్ చేయాలని, రైస్ మిల్లుల్లో సీసీ కెమెరాలు పెట్టి పూర్తిగా నిఘా ఉంచాలని కోరారు. పోర్టు ఎంట్రన్స్‌లో చెక్ పోస్టు పెట్టడం వల్ల 7 గంటల్లో చేసే లోడింగ్ మూడు రోజులు పడుతుందని, దీనివల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని మధు వివరించారు. మీరు పోర్టులో పట్టుకున్న బియ్యం అంతకు ముందే కలెక్టర్ వెళ్లి చూశారని, దానిపై ప్రకటన ఇచ్చారని మళ్లీ మీరు వచ్చి పట్టుకున్నట్లు యాక్టింగ్ చేయడం కరెక్టు కాదని పవన్‌కళ్యాణ్‌కు మధు హితవు పలికారు. కాకినాడ పోర్టును తరుచూ కించపరచవద్దని, తప్పు జరిగితే సీబీఐ విచారణ చేసి బియ్యం దొంగలను అరెస్టు చేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ పాల్గొన్నారు.

డీఎల్ఎడ్–1 సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల విడుదల

రాజమహేంద్రవరం రూరల్: డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎల్ఎడ్) ప్రథమ సంవత్సరం సప్లిమెంటరీ (2018–20 మేనేజ్‌మెంట్ అండ్‌స్పాట్ బ్యాచ్) పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయని బొమ్మూరులోని జిల్లా ప్రభుత్వ విద్యాశిక్షణ సంస్థ(డైట్) ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎం జయశ్రీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నవంబర్‌లో జరిగిన ఈ పరీక్షలకు 917మంది హాజరుకాగా, 544 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. 59.32 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. డమ్మీ మార్కుల జాబితా కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బిఎస్ఈ.ఏపీ.జీవోవి.ఐఎన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. మార్కుల రీకౌంటింగ్ కోసం దరఖాస్తు చేసుకోవాలనే అభ్యర్థులు, ఈ నెల ఏడవ తేదీలోగా డైట్‌లో కార్యాలయంలో ఫీజు చలానాతో పాటు తమ దరఖాస్తులను సమర్పించాలన్నారు. మార్కుల రీకౌంటింగ్‌కు ఫీజు రూ.500 చలానాను ఏపీ.సీఎఫ్ఎంఎస్ సిస్టమ్ ద్వారా మాత్రమే చెల్లించాలన్నారు.

శాంతివర్ధనం.. పరిమళించిన మానవత్వం

- దివ్యాంగ విద్యార్థులకు 18 ఏళ్లుగా సేవ
- నేడు ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

పెద్దాపురం: ఒకరిద్దరు బిడ్డలను సాకాలంటేనే ఎన్నో వ్యయ ప్రయాసలు పడుతున్న ఈ రోజుల్లో సుమారు 150 మంది దివ్యాంగులు, మానసిక చిన్నారుల (విభిన్న ప్రతిభా వంతుల) ఆలనా పాలనా చూసేందుకు వారు ముందుకువచ్చారు. వారి ఆకలి తీర్చిన అమ్మానాన్నలుగా సేవలందిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు శాంతి వర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాల నిర్వాహకులు రాయవరపు వీరబాబు, సత్య దంపతులు.

కాకినాడ జిల్లాలోని పెద్దాపురం మండలం తిరుపతి గ్రామానికి చెందిన రాయవరపు వీరబాబుకు చిన్నతనంలోనే ఓ కాలికి పోలియో సోకింది. తనలాగే వికలాంగత్వంతో బాధపడే వారి కోసం ఏదైనా చేయాలని భావించాడు. కంప్యూటర్ విద్యార్థిని సత్య వీరబాబును ప్రేమించింది. అతడి భావాలు, ఆలోచనలు నచ్చడంతో తల్లిదండ్రుల అనుమతితో 2002లో ఆదర్శ వివాహం చేసుకున్నారు. భర్త ఆశయాన్ని విని తాను కూడా చేదోడు వాదోడుగా నిలవాలనుకుంది భార్య సత్య. మానసికంగా, అంగవైకల్యంతో బాధపడే వారి కోసం ఏదైనా చేయాలని తలపించారా దంపతులు. వారి ఆలోచనలనుంచి పుట్టుకొచ్చిందే ‘శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక ఆశ్రమ పాఠశాల. 2006లో పెద్దాపురం మండలం చంద్రమాంపల్లిలో ముగ్గురు పిల్లలతో ఓ పాత వీడియో థియేటర్‌లో ప్రారంభమైన ఈ పాఠశాల నేడు పులిమేరు కేంద్రంగా, అన్నవరం బ్రాంచితో కలిపి సుమారు 150 మందికి పైగా పిల్లలకు ఆశ్రయం ఇచ్చే స్థాయికి ఎదిగింది. పాఠశాల ప్రారంభించిన మొదట్లో తమ, చేరదీసిన దివ్యాంగ బిడ్డలకు కడుపునిండా తిండి పెట్టేందుకు ఇంట్లో ఉన్న ఒక్కొక్క వస్తువునూ తాకట్టు పెట్టేశారు. ఒకానొక సమయంలో చివరకు తాళిబొట్టును కూడా తాకట్టు పెట్టి సొమ్ము తెచ్చి చిన్నారుల ఆకలిని తీర్చారు అమ్మకు ప్రతిరూపంగా నిలిచిన సత్య. ఇక్కడ ఉంటున్న వారిలో చాలామంది వివిధ రకాలుగా బాధపడుతూ అనాథలుగా మిగిలిన వారే. వారిలో కొందరికి వినిపించదు, మరికొందరికి రెండు కళ్లూ కనిపించవు, మరికొందరు ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేరు. చాలామంది రాత్రిళ్లు అసలు నిద్రే పోరు. వారందరికీ ఇప్పటికీ ఉచిత విద్య, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నారా దంపతులు.

ప్రముఖుల సందర్శన : ఈ పాఠశాలను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సోదరి షర్మిలారెడ్డి, మెగాస్టార్ చిరంజీవి వంటి పలువురు ప్రముఖులు గతంలో సందర్శించారు. పలు సందర్భాల్లో జిల్లాకు వచ్చిన వారు పాఠశాలను సందర్శించి చిన్నారుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.



పాఠశాల సందర్శనకు వచ్చిన మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని స్వాగతిస్తున్న విద్యార్థులు (ఫైల్)



పులిమేరు శాంతి వర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాల



విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు గోరుముద్దలు తినిపిస్తున్న సత్య

దాతల సహకారంతో..

ఈ పాఠశాల దాతల సహకారంతో కొనసాగుతోంది. 2006లో ముగ్గురితో ప్రారంభమైన ఈ పాఠశాల ఇప్పటికి 120 మంది విద్యార్థులతో నడుస్తోంది. నిర్వాహకులు ఇచ్చిన ‘చేయిచేయి కలుపుదాం.. చేయూతనిద్దాం’ అనే నినాదంతో జిల్లా నలుమూలల నుంచి దాతలు, పలు స్వచ్ఛంద సంఘాలు ఆర్థిక సహకారం చేస్తుండడంతో ఎటువంటి ఇబ్బందులు లేకుండా శాంతివర్ధన సంస్థ ముందుకు సాగుతోంది. అన్నవరంలో శాంతి వర్ధన పాఠశాల అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. పలువురు పుట్టినరోజు, వివాహ వేడుకలను ఈ పాఠశాలల్లో జరుపుకుని విద్యార్థులకు అవసరమైన వస్త్రాలు, దుప్పట్లు, సంస్థకు అవసరమైన పలు పరికరాలను అందజేస్తున్నారు.

అంగవైకల్యం తెలియనివ్వడం లేదు



మాది పిఠాపురం మండలం మంగుతుర్తి 13 ఏళ్ల కిందట గ్రామంలో అందరూ కుంటోడు కుంటోడు అంటే ఏడుపు వచ్చేది. అప్పుడే పులిమేరులో పాఠశాల ఉందంటే మా అమ్మానాన్నలు ఇక్కడ చేర్పించారు. ఇక్కడ చేరిన తరువాత అంగవైకల్యం ఉందన్న ధ్యాస లేకుండా ఆనందంగా గడుపుతున్నాను.

–మారే సత్తిబాబు, వికలాంగ విద్యార్థి, మంగుతుర్తి, పిఠాపురం మండలం

ఇక్కడ ఆనందంగా గడుపుతున్నా..



దేవుడు నాకు కళ్లు ఇవ్వలేదు. నా తండ్రి చనిపోవడంతో కుటుంబ సభ్యులకు భారం అయ్యాను. అయిన వారికి కష్టమని ఈ స్కూల్‌లో జాయిన్ చేశారు సహచర విద్యార్థులతో ఆనందంగా గడుపుతున్నాను.

– ఆర్సి సాయిధనలక్ష్మి, అంధ విద్యార్థి, యర్రవరం, ఏలేశ్వరం మండలం

ఇది దైవసేవగా భావిస్తాం



అంగవైకల్యంతో బాధపడేవారి గురించి ఎవరూ పట్టించుకోరు. అందుకనే వికలాంగులకు సేవ చేయాలనే సంకల్పంతో మేము ఈ పాఠశాలను స్థాపించాం. వీరి సేవలో ఎంతో ఆనందం లభిస్తోంది. వీరు మా పిల్లలతో సమానం. వికలాంగుల సేవచేయడం దైవసేవగా భావిస్తున్నాం.

– వీరబాబు సత్య దంపతులు, పాఠశాల నిర్వాహకులు, పులిమేరు

క్లుప్తంగా

ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు గైట్ విద్యార్థి


విద్యార్థి అంకిత్ దేబ్నాద్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు

రాజానగరం: ఆంధ్ర యూనివర్సిటీ ఇంటర్ వర్సిటీ యోగా పోటీల్లో స్థానిక గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థి అంకిత్ దేబ్నాద్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ యోగా పోటీలకు అర్హత సాధించాడు. ఈ నెల 24 నుంచి 28 వరకూ భువనేశ్వర్‌లోని కళింగ యూనివర్సిటీలో ఈ పోటీలు జరగనున్నాయని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని పలువురు అధ్యాపకులు, సహ విద్యార్థులు అభినందించారు.

గ్యాస్ పైపులైన్ లీకేజీ


లీకేజీ ఏర్పడిన ప్రాంతంలో పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

మామిడికుదురు: తాటిపాక ఓఎన్జీసీ స్ట్రక్చర్ పరిధి తాటిపాక–6 బావికి చెందిన పైప్‌లైన్‌కు గెద్దాడ గ్రామంలో సోమవారం లీకేజీ ఏర్పడింది. స్వల్పంగా గ్యాస్ లీక్ అవుతున్న విషయాన్ని గుర్తించిన స్థానికులు ఓఎన్జీసీ అధికారులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని బావి నుంచి సహజ వాయువు సరఫరాను నిలిపి వేశారు. తాటిపాక–6 బావి నుంచి నగరం గ్రామంలోని తాటిపాక జీసీఎస్‌కు పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరా చేస్తున్న పైప్‌లైన్‌కు ఈ లీకేజీ ఏర్పడినట్లు అధికారులు గుర్తించారు. లీకేజీ ఏర్పడిన చోట పది అడుగుల మేర పైపును తొలగించి, దాని స్థానే కొత్త పైప్ ఏర్పాటు చేశారు. తాటిపాక–6 బావి నుంచి ఉత్పత్తి అవుతున్న సహజ వాయువు సరఫరాలో హెచ్చుతగ్గులు ఉండడంతో ఇటీవల ఈ బావిలో వర్క్ ఓవర్ రిగ్‌తో రీ డ్రిల్లింగ్ నిర్వహించారు. అప్పటి నుంచి గ్యాస్ సరఫరా పెరిగిందని ఓఎన్జీసీ అధికారులు తెలిపారు.

వెండి ఆభరణాల సమర్పణ


పెదపళ్లలో రామాలయానికి సమర్పించిన వెండి ఆభరణాలు

ఆలమూరు: పెదపళ్లలోని తూర్పు వీధి రామాలయానికి సోమవారం వెండి ఆభరణాలను భక్తులు సమర్పించారు. దాతల సహకారంతో రామాలయంలోని సీతారామ, లక్ష్మణులు, ఆంజనేయస్వామి విగ్రహాలకు సుమారు రూ.ఐదు లక్షల విలువైన వెండి కిరీటాలు, పాదుకలు, ఇతర ఆభరణాలను సమర్పించారు. అలాగే గ్రామానికి చెందిన ఒక భక్తురాలు శ్రీరాముని విగ్రహానికి బంగారంతో తయారు చేయించిన నామాలను సమర్పించారు. రామాలయం అభివృద్ధికి ప్రజలు అందిస్తున్న సహకారం పట్ల ఆలయ కమిటీ నిర్వాహకుడు నామాల రుద్రయ్య చౌదరి కృతజ్ఞతలు తెలిపారు.

పర్యావరణానికి ప్రాధాన్యం ఇచ్చేలా..

- సాంకేతిక విద్యార్థులకు గ్రీన్ ఇంటర్న్‌షిప్
- కొత్త కొలువులకు సిద్ధం చేయడమే లక్ష్యం
- ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ విద్యార్థులకు అవకాశం
- ఏఐసీటీఈ సరికొత్త కోర్సుకు శ్రీకారం



బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇంజినీరింగ్ విద్యార్థులంటే సివిల్, మెకానికల్, ఐటీ, సాఫ్ట్‌వేర్ వంటి రంగాలకే పరిమితం కాదు. వీరికి పరిసరాల పట్ల అవగాహన పెంచి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో ఆలిండియా ఇనిస్టిట్యూట్ కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) న్యూఢిల్లీ సరికొత్త కోర్సుకు శ్రీకారం చుట్టింది. ఈ లక్ష్యాన్ని 2030 నాటికి పూర్తి చేయాలని నిర్ణయించింది. ప్రపంచ వ్యాప్తంగా గ్రీన్ ఎకానమీ ద్వారా పెద్దఎత్తున ఉద్యోగ, కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) అంచనా ప్రకారం 2030 నాటికి ప్రపంచ వ్యాప్తంగా 2.40 కోట్ల కొత్త ఉద్యోగాలు ఇది సృష్టిస్తుంది. అభివృద్ధి చెందిన దేశాల్లో 80.40 లక్షల కొత్త కొలువులు పుట్టుకువస్తాయి. అందుకే గ్రీన్ ఇంటర్న్‌షిప్‌లు చేస్తే ఆయా రంగాల్లో ఉద్యోగ ఫలాలు అందుకుంటారని భావించి ఈ వినూత్న కోర్సుకు శ్రీకారం చుట్టారు. గ్రీన్ ఇంటర్న్‌షిప్ కోసం గ్రీన్ స్కిల్స్ అకాడమీ సెల్ఫ్‌ఫోర్స్ అనే సంస్థతో ఏఐసీటీ ఒప్పందం చేసుకుంది. జేఎన్‌టీయూ కాకినాడ పరిధిలో రెండు ప్రభుత్వ కళాశాలలతో పాటు 151 ఇంజినీరింగ్, ఫార్మసీ మేనేజ్‌మెంట్ కళాశాలలు ఉన్నాయి.

ఇదీ ప్రయోజనం

ఇంటర్న్‌షిప్‌లు పొందిన వారు ఏఐసీటీఈ గుర్తింపు పొందిన కళాశాలలను హరిత ప్రాంగణాలుగా మార్చేందుకు ఉన్న అవకాశాలు, వనరులపై అధ్యయనం చేస్తారు. కర్బన ఉద్గారాలపై ఆడిట్ నిర్వహిస్తారు. అందులో భాగంగా ఇక్కడ వినియోగించే విద్యుత్తును పొదుపు చేయడం, నీటి సంరక్షణ, వనరుల పునర్వినియోగం వంటి సున్నా వృథా (జీరో వేస్ట్) విధానాలను రూపొందిస్తారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను అన్వేషిస్తూ ఆయా విద్యా సంస్థలు సుస్థిర అభివృద్ధి సాధించేలా అవగాహన కల్పిస్తారు. అందుకు విద్యార్థులకు ఆయా పరిశ్రమల నిపుణులు మెంటార్లుగా వ్యవహరిస్తారు. ఏఐసీటీఈ గుర్తింపు పొందిన కళాశాలల్లో (ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, ఫార్మసీ కోర్సులు) చదివే విద్యార్థులు అర్హులు. 2030 నాటికి లక్ష మంది విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ చేసేలా రూపకల్పన చేశారు. 2024–25లో 10 వేల మందికి ఇంటర్న్‌షిప్ కల్పించనున్నారు. దీనికోసం ఏఐసీటీఈ ఇంటర్న్‌షిప్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. కాల వ్యవధి 2 నుంచి 3 నెలలు ఉంటుంది. ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన తరువాత ధ్రువీకరణ పత్రం అందజేస్తారు. బాగా పనిచేసిన వారికి ప్రత్యేక గుర్తింపుతో పాటు అవార్డులు బహూకరిస్తారు.

మంచి నిర్ణయం



కాలుష్యపరంగా ఇప్పటికే సవాళ్లను ఎదుర్కొంటున్నాం. అందుకే ప్రపంచ దేశాలు కర్బన ఉద్గారాలను తగ్గించడంపై దృష్టి సారించాయి. విద్యుత్తును తక్కువగా వినియోగించుకునేలా హరిత భవనాలు నిర్మించడం, ఈ వ్యర్థాలను తగ్గించడం ద్వారా ఇది కొంత వరకూ సాధ్యమౌతుంది. ఈ లక్ష్యాల సాధనలో భాగంగా ఏఐసీటీఈ గ్రీన్ ఇంటర్న్‌షిప్ ప్రారంభించి మంచి నిర్ణయం తీసుకున్నారు. దేశ భవిష్యత్ పదికాలల పాటు పచ్చగా ఉండేలా లక్ష మంది సైన్యాన్ని తయారు చేసే దిశగా ఈ కార్యక్రమం రూపొందించారు.

–డాక్టర్ మురళీకృష్ణ, ఇన్‌చార్జి వీసీ జేఎన్‌టీయూకే

చాలా సంతోషకరం



రోజురోజుకూ పెరుగుతున్న కాలుష్య కోరల్లోంచి బయటపడాలంటే నేటితరం విద్యార్థులకు పర్యావరణంపై ఇంటర్న్‌షిప్ చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా సాంకేతిక విద్యను అభ్యసించే వారికి ఆలిండియా ఇనిస్టిట్యూట్ కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఇంటర్న్‌షిప్ కల్పించడం చాలా సంతోషం. గుర్తింపు పొందిన ప్రతి కళాశాల నుంచి విద్యార్థులు నమోదు చేసుకోవాలి. పర్యావరణ పరిరక్షణ భాగంగా చేయడం సంతోషించదగ్గ విషయం.

– డాక్టర్ పరుచూరి కృష్ణారావు, చైర్మన్, ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల

చేపల వేటను అడ్డుకుంటున్నారని ఆందోళన


కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న గెద్దనాపల్లి మత్స్యకారులు

అమలాపురం రూరల్: కాట్రేనికోన మండల పరిధిలోని గోదావరి ప్రాంతంలో వేటకు వెళ్లకుండా కొంతమంది నాయకులు అడ్డుకుంటున్నారని అమలాపురంలోని కలెక్టరేట్ వద్ద సోమవారం గెద్దనాపల్లికి చెందిన మత్స్యకారులు ఆందోళన చేపట్టారు. అధికార పార్టీ నాయకులు తమను చాలా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వేటకు వెళ్లకపోతే తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని మహిళలు ప్రశ్నించారు. టీడీపీ నాయకుడు నాగిడి నాగేశ్వరరావుతో పాటు కొంతమంది ఇబ్బందులకు గురిచేస్తున్నారని కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్‌లో గెద్దనాపల్లి మత్స్యకారులు ఫిర్యాదు చేశారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు వాపోయారు. వైఎస్సా ర్ సీపీకి చెందిన వారమని ముద్ర వేసి, ఇబ్బందులకు గురిచేస్తున్నారని గ్రామానికి చెందిన పోతాబత్తుల నారాయణరావు, మల్లాడి శ్రీనివాసరావు, చింతా లోవరాజు, పట్టా లక్ష్మణ్, అంగాని ఆంజనేయులు, చింతా రాంబాబు, అంగాని ప్రసాద్ అన్నారు. వేటకు అనుమతులు ఇవ్వాలని డిమాండ్ కోరారు. మల్లాడి శ్రీను, లక్ష్మణస్వామి, పోతాబత్తుల కాశీలింగేశ్వరరావు, సంగాని కాసులు, పోతాబత్తుల శ్రీనివాసరావు, సంగాని అనిల్‌కుమార్, మల్లాడి సాయిలక్ష్మణ్ పాల్గొన్నారు.

దాడి కేసులో ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేయాలి


అమలాపురం ఎస్పీ కార్యాలయం వద్ద రజక సంఘ నాయకులు

అమలాపురం టౌన్: మలికిపురం మండలం గూడవిల్లి శివారు గుబ్బలపాలేనికి చెందిన యువకుడిపై దాడి చేసిన ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ బాధిత యువకుడితోపాటు ఆ ప్రాంత రజక సంఘ నాయకులు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావుకు సోమవారం ఫిర్యాదు చేశారు. తొలుత స్థానిక కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేయాలని భావించిన రజక సంఘం నాయకులు అక్కడికి వెళ్లి కొద్దిసేపు ఇదే డిమాండ్‌పై ఆందోళన చేశారు. అయితే అరెస్ట్‌కు సంబంధించిన అంశం కాబట్టి ఎస్పీకి ఫిర్యాదు చేయాలని కలెక్టరేట్ సిబ్బంది సూచించడంతో వారు ఎస్పీ కార్యాలయానికి వచ్చి ఎస్పీని కలిశారు. ఈ దాడి కేసులో ముగ్గుర్ని అరెస్ట్ చేసిన పోలీసులు ప్రధాన నిందితుడు, దాడికి సూత్రధారిని పట్టుకోవాలని వారు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అనంతరం ఎస్పీ కార్యాలయం బయటకు వచ్చాక రజక సంఘం నాయకులు విలేకర్లతో మాట్లాడారు. ఈ ప్రభుత్వంలో రజకులపై దాడులు జరగడం దారుణమని వారు అన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, హోం మంత్రి అనిత తమ సంఘీయులపై దాడులు జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. మలికిపురంలో విద్యార్థి రామేశ్వరపు యువరాజుపై కొందరు యువకులు దాడి చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయిన సంగతి తెలిసిందే.

ఘర్షణలో వ్యక్తి మృతి


వీరబాబు (ఫైల్)

మండపేట: ఇద్దరి మధ్య చోటుచేసుకున్న చిన్నపాటి ఘర్షణ ఓ వ్యక్తి మృతికి కారణమైంది. ఈ ఘటన మండపేటలో చోటుచేసుకుంది. డాగ్ స్క్వాడ్ ద్వారా నిందితుడిని గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక గొల్లపుంత కాలనీకి చెందిన సింధూరపు వీరబాబు (36) అతని భార్య, పిల్లలతో గొడవపడి 7వ వార్డు ఎస్సీ పేటలో మహనీయుల స్మారక మందిరంలో తలదాచుకుంటున్నాడు. ఎప్పటిలాగే ఆ మందిరంలో నిద్రిస్తున్న వీరబాబుతో ఆదివారం రాత్రి మద్యం మత్తులో అదే పేటలో ఉంటున్న వేమగిరి సురేష్ ఘర్షణకు దిగాడు. దీంతో సిమెంట్ బల్లపై పడుకున్న వీరబాబును కిందకు లాగేయడంతో తలకు గాయమైంది. స్థానికులు బాధితుడిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వీరబాబు మృతి చెందినట్టు ఎస్‌ఐ హరికోటి శాస్త్రి తెలిపారు. రామచంద్రపురం డీఎస్పీ సమాచారం అందించడంతో సోమవారం ఉదయం ఆయన సంఘటనా ప్రాంతానికి చేరుకుని విచారణ చేపట్టారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. డీఎస్పీ పర్యవేక్షణలో రూరల్ సీఐ దొరరాజు, టౌన్ ఎస్‌ఐ శాస్త్రి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని టోకరా

కంబాలచెరువు: ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి స్నేహితుడి వద్ద రూ.5 లక్షలకు పైగా టోకరా వేసిన సంఘటన రాజమహేంద్రవరం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక టి.నగర్‌కు చెందిన వి.వెంకట సాయిదిలీప్ డిగ్రీ పూర్తి చేశాడు. ఉద్యోగం కోసం వెతుకుతున్నాడు. ఈ క్రమంలో ఆర్.కిశోర్‌కుమార్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. తనకు చాలా కంపెనీల్లో పెద్ద స్థాయి వారు తెలుసని, ఎంతో మందికి ఉద్యోగాలు వేయించానని దినేష్‌కు తెలిపాడు. దీనిని నమ్మి దినేష్ రూ.5.15 లక్షల వరకూ ఇచ్చాడు. రోజులు గడుస్తున్నా పని జరగకపోవడంతో కిశోర్‌కుమార్‌ను నిలదీశాడు. దీంతో కిశోర్‌కుమార్ వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో మాట్లాడానని, నీ పని అయిపోతుందని చెప్పాడు. ఆ పని జరగకపోవడంతో పాటు కొద్దిరోజుల తర్వాత కిశోర్‌కుమార్ ఫోన్ స్విచ్ఛాప్ వచ్చింది. దీంతో మోసపోయానని తెలుసుకుని సాయిదినేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంతంగా ఎన్నికల పోలింగ్ నిర్వహించండి


మాట్లాడుతున్న డీఆర్వో వెంకటరావు


సమావేశంలో పాల్గొన్న ఎన్నికల అధికారులు

కాకినాడ సిటీ: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ఈ నెల 5న జిల్లాలో ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఏఆర్వో, డీఆర్వో జె.వెంకటరావు అధికారులను ఆదేశించారు. తూర్పు–పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సోమవారం కాకినాడ కలెక్టరేట్ విధాన గౌతమీ సమావేశ మందిరంలో పోలింగ్ అధికారులు, సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఏఆర్వో హాజరై అవగాహన కల్పించారు. పోలింగ్ కేంద్రాల్లో విధులు, పోలింగ్ ప్రక్రియ తదితర అంశాలను ఏఆర్వో వెంకటరావు తెలిపారు. అధికారులు పోలింగ్ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఆరు జిల్లాల్లో మొత్తం 16,737 మందికి 116 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అదే విధంగా కాకినాడ జిల్లాలో 3,418 ఓటర్లకుగాను 22 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ ప్రక్రియ ఈ నెల 5వ తేదీ గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ జరుగుతుందన్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బ్యాక్స్‌లను సురక్షితంగా కాకినాడ జేఎన్టీయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు తరలించే వరకూ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఎన్నికల విభాగం ఉప తహసీల్దార్ ఎం.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిధిలో మద్యం బంద్

కాకినాడ సిటీ: ఈ నెల 5న ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఆయా పోలింగ్ కేంద్రాలకు సమీపంలోని మద్యం దుకాణాలను మూసివేయనున్నారు. ఈ మేరకు 48 గంటల పాటు మూసి ఉంచే విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ ఎలక్ట్రోరల్ అధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు తూర్పు, పశ్చిమ గోదావరి ఎమ్మెల్సీ ఎన్నికల అధికారి, కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గ పోలింగ్ కేంద్రాలున్న సమీప ప్రాంతాల్లో ఈ నెల 3వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి 5వ తేదీ సాయంత్రం 4 గంటల వరకూ డ్రై డేగా పాటించి తప్పనిసరిగా మద్యం దుకాణాలను మూసివేయాలని కలెక్టర్ సూచించారు.

450 సెల్‌ఫోన్ల రికవరీ


రికవరీ చేసిన సెల్‌ఫోన్‌తో జిల్లా ఎస్పీ నరసింహకిశోర్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా వ్యాప్తంగా చాట్ బోట్ ద్వారా వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టి 450 సెల్ ఫోన్లను రికవరీ చేశారు. ఆ వివరాలను జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్ సోమవారం తెలిపారు. ఇప్పటి వరకూ 5 విడతల్లో మొత్తం 1,843 సెల్‌ఫోన్లు రికవరీ చేశామని, వాటి విలువ సుమారు రూ.3.14 కోట్లు ఉంటుందన్నారు. ఇప్పటి వరకూ చేసిన సెల్‌ఫోన్ల రికవరీలలో ఇంత అధికం ఇదేనన్నారు. చాట్‌బోట్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని, ఫోన్ చోరీకి గురైన, మిస్సయిన వారు ఈ సేవలను ఉపయోగించుకుంటే పోగొట్టుకున్న సెల్‌ఫోన్లన రికవరీ చేయటం సులభం అవుతుందన్నారు. గుర్తు తెలియని వ్యక్తుల ద్వారా బిల్లులు లేని సెల్ ఫోన్లను కొనడం చేయరాదన్నారు. దొరికిన సెల్ ఫోన్లను దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌కి అందజేయాలన్నారు. సెల్ ఫోన్లను రికవరీ చేసిన సోషల్ మీడియా అండ్ సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరరావు, ఐటీ కోర్ టీం ఐ.అయ్యప్పరెడ్డి, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం

కాకినాడ రూరల్: సర్పవరం రోడ్డులో సుభానికేతన్ స్కూల్ సమీపంలో శంకర్ టవర్స్ అపార్ట్‌మెంట్ వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో బొంతు సూర్యనారాయణ(70) మృతి చెందాడు. సర్పవరం పోలీసుల కథనం ప్రకారం.. కొత్త గైగోలుపాడుకు చెందిన సూర్యనారాయణ సైకిల్‌పై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. వాహనం చక్రాలు తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు మృత దేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ పెద్దిరాజు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య


కృపానందం (ఫైల్)

గండేపల్లి: అనారోగ్యం కారణంగా మనస్తాపం చెంది ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై యూవీ శివ నాగబాబు తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని మల్లేపల్లికి చెందిన అయితే కృపానందం (80) ఆదివారం ఉదయం ఇంటి నుంచి పని నిమిత్తం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అప్పటికే అతను అనారోగ్యం కారణంగా మనస్తాపంలో ఉన్నాడు. అతని ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించగా సోమవారం ఉదయం రాజానగరం మండలం తూర్పుగోను గూడెంలోని ఊర చెరువులో అతను మృతిచెంది కనిపించాడు. అతను ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుని కుమార్తె ఇంజరపు కృప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

హత్యేనని అనుమానం


బచ్చు దానయ్య మృతదేహం

కాకినాడ క్రైం: కాకినాడలో అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. నగరానికి చెందిన బచ్చు దానయ్య అలియాస్ డాలి (35)కి ఇంకా వివాహం కాలేదు. వార్ఫ్ రోడ్ సమీపంలో నివాసం ఉంటున్నాడు. కొన్ని వివాదాల్లో భాగమయ్యాడనే ఆరోపణలు ఉన్న డాలిపై కాకినాడలో వివిధ లా అండ్ ఆర్డర్ స్టేషన్లలో పలు కేసులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో డాలి ఆదివారం అర్ధరాత్రి తన ఇంటికి సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఓ డ్రైనేజీలో విగతజీవిగా కనిపించాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మద్యం తాగి పడిపోయి తలకు తీవ్ర గాయమై డాలి మృతిచెంది ఉంటాడని భావిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాకినాడ వన్ టౌన్ నాగదుర్గారావు పర్యవేక్షణలో ఎస్‌ఐ స్వామినాయుడు విచారణాధికారిగా కేసు విచారణ చేపడుతున్నారు. ఇదిలా ఉంటే, డాలిది హత్యేనని స్థానికులు భావిస్తున్నారు. ఇరువర్గాల మధ్య జరిగిన వివాదం హత్యకు దారి తీసిందని అంటున్నారు. అర్ధరాత్రి గుర్తు తెలియని ముగ్గురు డానిపై ఇనుపరాడ్లతో దాడి చేశారని చూసిన వారు చెబుతున్నారు. వారి వాదనకు బలం చేకూర్చేలా సమీపంలోని ఓ డ్రైనేజీలో రెండు ఇనుపరాడ్లను పోలీసులు సోమవారం సాయంత్రం గుర్తించారు. సమీపంలో రెండు సీసీ టీవీ ఫుటేజ్‌లు పరిశీలించిన పోలీసులకు గుర్తు తెలియని ముగ్గురు అర్ధరాత్రి వేళ చేతుల్లో రాడ్లు పట్టుకుని డాని నివాసం వైపు వెళ్లడం అనుమానాస్పదంగా కనిపించింది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని, ఘటనపై లోతైన విచారణ చేపడుతున్నామని సీఐ నాగదుర్గారావు తెలిపారు.

ఆపరేషన్ చేస్తే కంటిచూపు పోయింది

వైద్యుల నిర్లక్ష్యమేనని బంధువుల ఆందోళన



ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న బాధిత మహిళ కుటుంబ సభ్యులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): కంట్లో శుక్లాల ఆపరేషన్ చేయించుకుంటే ఉన్నచూపునే పోగొట్టారంటూ స్థానిక ఓ ప్రైవేట్ ఆసుపత్రి వద్ద బాధిత మహిళ కుటుంబీకులు ఆందోళన చేపట్టారు. బాధిత మహిళ కుమారుడు బి.దుర్గాప్రసాద్ కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం రూరల్ కాతేరుకు చెందిన అమ్మాజీ స్థానిక దేవీచౌక్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో కంటి చూపు పరీక్ష చేయించుకుంది. ఆమెకు శుక్లాలు పెరిగాయని, ఆపరేషన్ చేయించుకోవాలని అక్కడ కంటి వైద్యురాలు సూచించారు. దీంతో అమ్మాజీకి గత నెల 11న ఆరోగ్యశ్రీలో శుక్లాల ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ చేసిన వారం రోజులు అయినా కంటిచూపు లేకపోవడంతో ఆసుపత్రికి వచ్చి వైద్యులను అడిగారు. ఇంకా కొద్ది రోజులు ఆగాలని తెలిపారు. మూడు వారాలైనా కంటిచూపు రాకపోవడంతో ఆసుపత్రికి వచ్చి అమ్మాజీ కుటుంబీకులు నిలదీశారు. దీనికి ఆసుపత్రి యాజమాన్యం, వైద్యులు ఎటువంటి సమాధానం చెప్పకపోవడంతో బాధితురాలుతో పాటు కుటుంబీకులు ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు. ఫ్లకార్డులను ప్రదర్శిస్తూ తమకు న్యాయం చేయాలంటూ టెంట్ వేసుకుని ధర్నా చేపట్టారు. విషయం తెలిసిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. దీనిపై ఇంకా ఎటువంటి కేసు నమోదు కాలేదు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం–కొవ్వూరు రైల్వే స్టేషన్ల మధ్య సుమారు 50 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి రైలు ప్రమాదంలో మృతి చెందాడని స్థానిక జీఆర్పీ ఎస్‌ఐ మావుళ్లు సోమవారం తెలిపారు. కేసు నమోదు చేసి గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. మృతుడు నీలం, ఆరంజ్ రంగు చెక్స్ కలిగిన షర్ట్, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. ఈ వ్యక్తి గురించి ఏదైనా సమాచారం తెలిస్తే 94406 27551, 94910 03239 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

చికిత్స పొందుతూ..

గండేపల్లి: చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి చెందినట్టు స్థానిక ఎస్సై యువి శివ నాగబాబు తెలిపారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని మల్లేపల్లికి చెందిన చాగంటి సీతారామచంద్రరావు (75) నవంబర్ 28వ తేదీ తెల్లవారుజామున రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడిని బంధువులు చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. దీనిపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

వ్యాన్ ఢీకొని..

కాకినాడ రూరల్: కాకినాడ బొందగుంట వీఎస్ లక్ష్మీ కాలేజీ సమీపంలో ఆదిత్య నర్సింగ్ హోమ్ రోడ్డు వద్ద సోమవారం వ్యాన్ ఢీకొని సూర్యారావుపేటకు చెందిన దాసరి ధనకొండ (40) మృతి చెందాడు. ధనకొండ మోటారు సైకిల్‌పై వెళుతుండగా వ్యాన్ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్టు సీఐ పెద్దిరాజు తెలిపారు.

సారా విక్రేతల అరెస్ట్


ఆలమూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో సారా విక్రేతలతో పోలీసులు

ఆలమూరు: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని అధికారుల బృందం సోమవారం నాటు సారా విక్రయాలపై దాడులు నిర్వహించింది. ఆలమూరు ఎక్సైజ్ సీఐ ఐడీ నాగేశ్వరరావు కథనం ప్రకారం.. ఇతర ప్రాంతాల నుంచి సారాను తీసుకువచ్చి మండపేట మండలంలో పలు గ్రామాల్లో విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని సమాచారం అందడంతో పోలీసులు సత్వరం స్పందించారు. తొలుత కేశవరంలో సారా విక్రయిస్తున్న కడగాలి రాంబాబును అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 70 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఏడిద సావరంలో సారా విక్రయిస్తున్న కాంద్రేగుల సూరిబాబును అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి ఐదు లీటర్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సీఐ నాగేశ్వరరావు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.